# వరలక్ష్మీవ్రతం- వ్రతవిధానం

సంకలనం : టీవీయస్. శాస్త్రి




**శ్రా**వణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీవ్రతంగా జరుపు కోవడం ఒక హిందూ ఆచారం.

## ప్రార్థన

*నమస్తేస్తు మహామాయే శ్రీ పీఠే సుర పూజితే*
*శంఖచక్ర గదా హస్తే మహాలక్ష్మీ నమోస్తుతే*

**తాత్పర్యం** : మహామాయారూపిణి, శ్రీపీఠవాసిని, దేవతలు నిరంతరం సేవించే లోకమాత, శంఖ, చక్ర, గదలను ధరించిన మహాలక్ష్మీదేవి అష్టైశ్వర ప్రదాయిని. అష్ట సంపదల్ని అందించే జగన్మంగళ దాయిని. అష్టైశ్వరాల్నీ కలగజేసే అష్టలక్ష్మి రూపాన్నే వరలక్ష్మీదేవిగా మనం ఆరాధిస్తాం. భక్తితో పూజించినవారికీ, కొలిచినవారికీ కొంగుబంగారమై వరాలనిచ్చే మహాలక్ష్మే వరలక్ష్మి.

## పురాణ గాథ

స్కాంద పురాణంలో పరమేశ్వరుడు వరలక్ష్మీవ్రతం గురించి పార్వతీదేవికి వివరించిన వైనం ఉంది. లోకంలో స్త్రీలు సకల ఐశ్వర్యాలనూ, పుత్రపౌత్రాదులనూ పొందేందుకు వీలుగా ఏదైనా ఓ వ్రతాన్ని సూచించమని పార్వతీదేవి ఆదిదేవుణ్ణి కోరుతుంది. అప్పుడు శంకరుడు, గిరిజకు వరలక్ష్మీవ్రత మహత్మ్యాన్ని వివరించాడని చెబుతారు. అదే సందర్భంలో శివుడు ఆమెకు చారుమతీదేవి వృత్తాంతాన్ని తెలియజేశాడంటారు. భర్తపట్ల ఆదరాన్నీ, అత్తమామల పట్ల గౌరవాన్నీ ప్రకటిస్తూ

చారుమతి ఉత్తమ ఇల్లాలుగా తన బాధ్యతల్ని నిర్వహిస్తూ ఉండేది. మహాలక్ష్మీదేవి పట్ల ఎంతో భక్తిశ్రద్ధలు కలిగిన చారుమతి, అమ్మవారిని త్రికరణ శుద్ధిగా పూజిస్తుండేది. ఆ మహా పతివ్రతపట్ల వరలక్ష్మీదేవికి అనుగ్రహంకలిగి, స్వప్నంలో ఆమెకు సాక్షాత్కరిస్తుంది. శ్రావణ శుక్ల పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారాన తనను ఆరాధిస్తే కోరిన వరాలన్నీ ఇస్తానని ఆమెకు దేవదేవి అభయమిస్తుంది. అమ్మ ఆదేశానుసారం వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించి చారుమతి సమస్త సిరి సంపదలను అందుకుందని ఈశ్వరుడు, గౌరికి విశదపరచాడని పురాణ కథనం. దాంతో పార్వతీదేవి కూడా ఈ వ్రతాన్ని ఆచరించి, వరలక్ష్మి కృపకు పాత్రురాలైందని చెబుతారు.

**ఎందుకు ఈ వ్రతం?**

అష్టలక్ష్ముల్లో వరలక్ష్మీదేవికి ఓ ప్రత్యేకత ఉందంటారు. మిగిలిన లక్ష్మీ పూజలకంటే వరలక్ష్మీ పూజ శ్రేష్ఠమని శాస్త్ర వచనం. శ్రీహరికి ఇష్టమైన, పైగా విష్ణువు జన్మనక్షత్రమైన శ్రవణం పేరిట వచ్చే శ్రావణ మాసంలో ఈ వ్రతాన్ని చేస్తే విశేష ఫలితాలు లభిస్తాయంటారు. సర్వమంగళ సంప్రాప్తి కోసం, సకలాభీష్టాలకోసం, నిత్య సుమంగళిగా తాము వర్ధిల్లాలని పుణ్యస్త్రీలు ఈ వ్రతం చేస్తారు. దక్షిణ భారతదేశంలో ఈ వరలక్ష్మీవ్రతాన్ని వివిధ సంప్రదాయాల్లో ఆచరిస్తారు. ఎవరు ఏ పద్ధతులు పాటించినా శ్రీలక్ష్మిని కొలిచే తీరు మాత్రం అందరిదీ ఒక్కటే! సకల శుభంకరమైన, సన్మంగళ దాయకమైన వరలక్ష్మీదేవి పూజ జగదానందకరమైనదని భక్తులందరి ప్రగాఢ విశ్వాసం.

**వ్రత విధి విధానం**

మహిమాన్వితమైన శ్రీవరలక్ష్మీవ్రతం ఆచరించే శుక్రవారాన సూర్యోదయానికి ముందే లేచి, అభ్యంగనస్నానం ఆచరించి మహిళలు నూతన వస్త్రధారణ చేస్తారు. పూజామందిరాన్ని, ఇంటిని శుభ్రపరచుకుని గడపకు పసుపు, కుంకుమ, గుమ్మానికి మామిడాకులు, పూలు కలిపి తోరణాలు, రంగవల్లికలతో అలంకరణ చేస్తారు. దేవునిముందు పసుపు రాసి ముగ్గులు, బొట్టు పెట్టి ఉన్న పీటను ఉంచి దానిపై నూతనవస్త్రాన్ని పరచి బియ్యం పోసి పసుపు, కుంకుమాలంకృతమైన కలశాన్ని ఉంచుతారు. ఒక కొబ్బరికాయను తీసుకుని దానికి శ్రీవరలక్ష్మీ రూపం ప్రతిబింబించేవిధంగా పసుపు ముద్దతో కళ్ళు, ముక్కు, చెవులు తీర్చిదిద్దుతారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించి ఆ టెంకాయకు ఆభరణాలు అలంకరించి కొత్త చీర కట్టుతారు.

అమ్మకు పూలజడ వేస్తారు. అలా అలంకరించిన రూపాన్ని కలశంపై ఉంచుతారు. ఆ తర్వాత ఆకుపచ్చటి చీరతో కూర్చున్న లక్ష్మీదేవి ప్రతిమను పసుపు, కుంకుమలతో అలంకరించి పూజకు సిద్ధం చేసుకొంటారు. పూజకు అక్షతలు, పద్మములు, కలువపూలు, మల్లెలు, పొన్నలు, సన్నజాజులతో అష్టోత్తరశతనామావళులతో పూజ చేస్తారు. తొలుత పసుపుతో గణపతిని చేసి పూజించి, కలశంలోనికి వరలక్ష్మీదేవిని ఆవాహనచేసి షోడశోపచార పూజ, తరువాత అథాంగపూజ చేయవలెను. దాని తరువాత అష్టోత్తరశతనామ పూజతో నామాలను చదివి, ధూప, దీప, నైవేద్యాలను తాంబూలాలని సమర్పించి కర్పూర నీరాజనం, మంత్రపుష్పం సమర్పించి మంగళహారతి ఇచ్చి తోరగ్రంథి పూజ చేసి తోరబంధనమంత్రం పఠిస్తూ ఆ నవసూత్రాన్ని కుడిచేతికి కట్టుకొనవలెను. నవకాయ పిండివంటలూ, పండ్లూ మొదలైన వాటిని అమ్మవారికి సమర్పించి, చివరగా వాయనదానమంత్రం పఠిస్తూ ఒక ముత్తైదువకు తాంబూలం సమర్పిస్తూ ఆమెని మహాలక్ష్మిగా భావించి వాయనమీయవలెను. పూజ పూర్తి అయిన తరువాత ఇరుగు పొరుగు ముత్తైదువలను పిలుచుకుని పండు, తాంబూలాదులను, శనగలను ఇచ్చి ఆశీర్వచనాలను తీసుకొంటారు. తాంబూలంతోపాటు కొందరు వరలక్ష్మీవ్రతం పుస్తకాలను కూడా అందజేస్తారు. ఈ పర్వదినాన అష్టలక్ష్మీ దేవాలయాన్ని దర్శించుకుంటే కోటి జన్మల పుణ్యఫలం లభిస్తుందని మహిళల నమ్మకం. లక్ష్మీ ఆలయాల్లో శ్రీలక్ష్మీకుంకుమ పూజ, అష్టోత్తరశతనామ పూజలు, పంచామృతంతో అభిషేకం వంటివి చేయిస్తే సకల భోగభాగ్యాలను ప్రసాదిస్తుందని వారు విశ్వసిస్తారు. అష్టదళపద్మంలో ఆసీనురాలైన లక్ష్మి చిద్రూపిణియై చిన్మయరూపిణిగా వెలుగొందుతుంది. ఆ లక్ష్మీదేవిసే నియమనిష్ఠలతో ఆచార సాంప్రదాయాలను పాటించేవారి ఇంట లక్ష్మి స్థిరనివాసం ఏర్పరుచుకొంటుందని అంటారు. ఆ తల్లిని కష్టసమయాలలలో స్థిరచిత్తాన్ని ఇచ్చి విజయాన్ని చేకూర్చమని వేడుకొంటారు. అలాంటి లక్ష్మీదేవిని కొలవడానికి వీలుకాకపోతే ఈ మాసంలో వచ్చే ఏ శుక్రవారం నాడైనా చేసుకోవచ్చు. ఇలా చేసుకొన్నవారికి కూడా అమ్మ అనుగ్రహం లభిస్తుంది. అమ్మకు చంద్రుడు సోదరుడు. అందువల్ల అమ్మను పూజించినచో చంద్రానుగ్రహం కలుగుతుంది. లక్ష్మీదేవి మహావిష్ణువుకి భర్త అయినందున విష్ణుదేవుని అనుగ్రహాన్నీ అమ్మపూజతో పొందవచ్చు. అమ్మవారికి ఇష్టమైన చిత్రాన్నము, పాయసం, వడలు, సున్నిఉండలు, కజ్జికాయలు, మురుకులు, పోళీలు వంటివి ఇంటివాడుకను బట్టి తొమ్మిది

రకాలుగాని, ఇరవైఒక్కరకాలుగాని తయారుచేసి అమ్మకు నివేదిస్తారు. ఆ వ్రతకధను అక్షంతలుపట్టుకొని విని పూజ చేయంచిన బ్రాహ్మణునకు దక్షిణ తాంబూలాదులను సమర్పించుతారు.

**తోరగ్రంథి పూజ**

తొమ్మిది దారుపుపోగులతో తొమ్మిది ముడులు వేసి మధ్యన పంచపుష్పాలను కట్టి దానికి తోరగ్రంథి పూజ చేస్తారు. మంగళహారతి ఇచ్చి తోరగ్రంథి పూజ చేసి తోరబంధన మంత్రం పఠిస్తూ ఆ నవసూత్రాన్ని కుడిచేతికి ధరించి పూజచేస్తారు. దీనివల్ల పుత్రపౌత్రాభివృద్ధి కలుగుతుందని భక్తులనమ్మకం.

*ఈ వరలక్ష్మీ వ్రత పర్వదినాన అందరూ అమ్మవారి దయకు పాత్రులు కాగలరు...*